క్లుప్తంగా

రామకోటి మహాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న భక్త కమిటీ సభ్యులు

సరుబుజ్జిలి: రొట్టవలస రామానందాశ్రమంలో త్వరలో జరగనున్న రామకోటి మహాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రామకోటి లిఖిత జప మహాయజ్ఞంలో 108 రకాల ఔషధ గుణాలు కలిగిన వనమూలికలను వినియోగిస్తున్నట్లు ఆశ్రమం వ్యవస్థాపకుడు తొత్తడి వెంకటరమణ స్వామి తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో ఆశ్రమ భక్త కమిటీ సభ్యులు మూడడ్ల రమణ, తాడేల వెంకటరమణ, తొత్తడి వైకుంఠరావు, తొత్తడి రమేష్‌బాబు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, సప్పటి వసంతరావు

పొందూరు: నేత్రాలను కాపాడుకోవడంలో నిర్లక్ష్యం వహించవద్దని డాక్టర్ బి.సునీల్‌కుమార్, ఆఫ్తాలమిక్ ఆఫీసర్ సప్పటి వసంతరావు తెలిపారు. ప్రభావతి జాగృతి ట్రస్టు ఆధ్వర్యంలో గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పొందూరులో జాలీ వాకర్స్ క్లబ్ సభ్యులకు గ్లకోమాపై అవగాహన కల్పించారు. 40 ఏళ్లు దాటినవారంతా నేత్ర వైద్యుడిని సంప్రదించి గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ విజయభాస్కర్, ఎంఈఓ-2 పట్నాన రాజారావు, మాసాడ బోగి రాజు, మోహన్‌రావు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీకి సహకరించాలి


మాట్లాడుతున్న తమ్మినేని విద్యాసాగర్

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏప్రిల్ 25వ తేదీ నుంచి నిర్వహించనున్న అంతర రాష్ట్ర పీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఎంసీసీ ఆర్గనైజర్ తమ్మినేని విద్యాసాగర్ కోరారు. ఆదివారం కళాశాల మైదానంలో క్రికెట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ క్రికెట్ పోటీలను ప్రతీ ఏడాది నిర్వహిస్తున్నామని, అదే విధంగా ఈ ఏడాది కూడా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. అనంతరం గ్రౌండ్స్ సభ్యులతో కలిసి పరిశీలించారు. సీనియర్ క్రికెటర్లు నారా ఈశ్వరరావు, గంధం వేణుగోపాలరావు, పలివేటి రాధాకృష్ణ, బిట్టు, అనీల్, కౌశిక్, బలివాడ శ్రీనివాస్, కాత్ర సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

80 మందికి నేత్ర పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జలుమూరు: శ్రీముఖలింగంలోని గిరిధార్ ఫిల్లింగ్ స్టేషన్ ఆవరణలో ఆదివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 20 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సి.హెచ్.అశ్వినీకుమార్, ఆప్తాలమిక్ అధికారి రాజు, అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలు


పూజలు నిర్వహిస్తున్న యువకులు

పాతపట్నం: మండల కేంద్రంలో కళింగ వైశ్యుల ఆధ్వర్యంలో సామూహిక ఉపనయనోత్సవం నిర్వహించారు. ఆదివారం పాతపట్నంలో కోర్టు కూడలి నుంచి ప్రధాన రహదారి మీదుగా నీలకంఠేశ్వర ఆలయం వరకు దీక్ష చేసిన యువకులు శోభాయాత్ర చేపట్టారు. నీలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళింగ వైశ్యులు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

కొత్తూరు: మండల కేంద్రంలో ఆదివారం జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,820లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

దాహం కేకలు


పార్వతీశ్వరునిపేట వద్ద తాగునీటి ట్యాంకర్ కోసం ఎదురుచూస్తున్న మహిళలు

- ఆమదాలవలస మున్సిపాలిటీ శివారు ప్రాంతాల్లో తాగునీటికి కటకట
- వేసవి తాపాన్ని తట్టుకునేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- రెండు రోజులకొకసారి ట్యాంకర్లతో తాగునీటి సరఫరా
- అర్ధాంతరంగా నిలిపివేసిన పైపులైన్ల పనులు

ఆమదాలవలస: వేసవి కాలం పూర్తిగా రాకముందే ఆమదాలవలస మున్సిపాలిటీలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. శివారు ప్రాంతాలు, పట్టణ ప్రాంతంలోని పలు వీధులకు తాగునీరు పూర్తిస్థాయిలో అందడంలేదు. మున్సిపాలిటీ ఏర్పడి సుమారు మూడు దశాబ్దాలు అవుతుంది. ఇప్పటికీ తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. 23 వార్డుల్లోనూ రోజుకు రెండుసార్లు కుళాయిల ద్వారా తాగునీరు అందించాలి. పట్టణ జనాభా దృష్ట్యా.. కొన్ని వార్డులకు ఉదయం, మరికొన్ని వార్డులకు సాయంత్రం మంచినీటిని సరఫరా చేస్తున్నారు.

పైపులైన్లు లేని ప్రాంతాలు ఇవే..

మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో గల తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, పార్వతీశ్వరునిపేట, 4వ వార్డులో గేదెలవానిపేట, కళింవలసపేట, 5వ వార్డులో రెడ్డిపేట, సొట్టవానిపేట,

ఆమదాలవలస పురపాలక సంఘంలో వార్డులు	23
మొత్తం కుటుంబాలు	11,475
మొత్తం జనాభా	49,823 మంది
రోజుకు అవసరమైన తాగునీరు	5,600 లీటర్లు
సరఫరా చేస్తున్న నీరు	4,525 లీటర్లు
లోటు	1,075 లీటర్లు)

పంతులపేట, 6వ వార్డులో సప్తపురాలు, నందగిరిపేట, తురకపేట, టి.మన్నయ్యపేట, కె.మన్నయ్యపేట, కంచరాపువానిపేట, 7వ వార్డులో చింతాడ, చింతాడ ఎస్సీ కాలనీ, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాలకు ఇప్పటికీ తాగునీటి పైపులైన్లు లేవు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్లతోనే తాగునీరు అందించాల్సిన పరిస్థితి.

ఫలితం అంతంతమాత్రమే..

2022 సెప్టెంబర్‌లో మున్సిపాలిటీ పరిధిలో 23వ వార్డులకూ నిరంతం తాగునీరు అందించేందుకు పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.61.38 కోట్ల (తాగునీటి ప్రాజెక్టుకు) నిధులు మంజూరు చేశారు. అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం ఈ పనులకు శంకుస్థాపన చేశారు. పలు వార్డుల్లో పైపులైన్ల నిర్మాణాలకు, రక్షిత మంచినీటి పథకాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికీ పలుచోట్ల పనులు పూర్తికాకపోవడంతో పట్టణ వాసులకు తాగునీటి ఇక్కట్లు తప్పడంలేదు. 2018లో అప్పటి ప్రభుత్వం హయంతో రూ.40 కోట్ల నిధులతో కొంతమేర తాగునీటి ప్రాజెక్టు పనులు చేపట్టారు. పాత పైపులైన్లు వంశధార నది నుంచి మార్గమధ్యంలోని వి, పట్టణ పరిధిలో కొన్ని పాత పైపులైన్లు తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు.


తాగునీరు పూర్తి స్థాయిలో అందించాలి



గతంలో తాగునీరు పూర్తిస్థాయిలో అందించేవారు. ప్రస్తుతం మా గ్రామానికి ట్యాంకర్‌తో రోజు విడిచి రోజు తాగునీరు అందిస్తున్నారు. కొత్త పైపులైన్లు మా గ్రామం వద్దకు కూడా వేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. పనులు మాత్రం జరగడంలేదు.

– దండుపాటి రాజేశ్వరి, గృహిణి, జగ్గుశాస్త్రులపేట, ఆమదాలవలస మున్సిపాలిటీ

రోజూ తాగునీరు అందించాలి



పైపులైన్ల నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఎగువ ప్రాంతంలో ఉండటంతోనే తాగునీరు రావడంలేదని అధికారులు చెబుతున్నారు. గతంలో ట్యాంకర్ల ద్వారా ప్రతీరోజు తాగునీరు అందించేవారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు అందిస్తున్నారు. రాత్రి సమయాల్లో తాగునీటి ట్యాంకర్ రావడంతో తాగునీరు పట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నాం. అయినప్పటికీ పూర్తి స్థాయిలో తాగునీరు అందించడం లేదు.

– మెట్ల హైమావతి, పార్వతీశ్వరునిపేట, ఒకటో వార్డు

పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తాం



అన్ని వార్డులకూ పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు కార్యాచరణ తయారుచేశాం. శివారు గ్రామాలకు టాంకర్లతో నీరు అందిస్తున్నాం. ప్రతీరోజు అందించేందుకు అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్నాం. కొన్నిచోట్ల పైపులైన్లు మరమ్మతులు చేపట్టాల్సి వస్తుంది. దీంతో కొన్ని రోజులపాటు తాగునీటికి ఇబ్బంది కలుగుతుంది. మున్సిపాలిటీలో కొంతమంది పైపులైన్లకు మోటార్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. దీనివల్ల ఎగువ ప్రాంతాలకు నీరు అందడంలేదు.

– పూజారి బాలాజీప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న బుచ్చిబాబు, కృష్ణారావు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. పాతపట్నం నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ రైతు సంఘం అధ్యక్షుడిగా మండలంలోని ఒంద్రుజోలకు చెందిన నిమ్మగడ్డ కృష్ణారావును, నియోజకవర్గ స్థాయి అంగన్‌వాడీ కేంద్రాల వైఎస్సార్‌సీపీ సంఘం అధ్యక్షుడిగా మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీకి చెందిన అంపిలి బుచ్చిబాబును పార్టీ అధిష్టానం ఇటీవలి నియమించింది. వీరిద్దరూ ఆదివారం పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రైతులను ప్రభుత్వం ఎలా మోసం చేసిందో వివరించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, దీనిని ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, బీసీ సెల్ నియోజకవర్గ స్థాయి అధ్యక్షుడు అగతమూడి నాగేశ్వరరావు, సర్పంచ్ గంధవరపు నాగేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, రత్నాలు, కృష్ణమోహన్, ఎస్.రమేష్, తదితరులు పాల్గొన్నారు

సందడిగా గిరిజన గ్రామ దేవత పండగ



కొత్తూరు మండలంలోని గొట్టిపల్లిలో ఆదివారం గిరిజన గ్రామ దేవత పండగ ఘనంగా నిర్వహించారు. ఉజ్జిడి బండిని గిరిజన సంప్రదాయం ప్రకారం గ్రామ పొలిమేరకు తీసుకువెళ్లారు. ముర్రాటలతో గ్రామదేవతకు చల్లదనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీడిమామిడి, మామిడి పంటలు పిందే, పూత దశలో ఉన్నందున పంటలు సేకరించే ముందు ప్రతీ ఏడాది ఈ పండగను నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. పండగ నిర్వహించిన అనంతరం కొండలపై పండించే పంటలను ఇళ్లకు తీసుకువస్తామన్నారు.

– కొత్తూరు

పొంచి ఉన్న ప్రమాదం



కొత్తూరు మండలంలోని మెట్టూరు–గొట్టిపల్లి రోడ్డులో ఇరపాడు గూడ సమీపంలో భారీ గొయ్యి ఏర్పడింది. సుమారు 20 గిరిజన గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. ఇటీవల రహదారి మరమ్మతులు చేపట్టినప్పటికీ గొయ్యిని మాత్రం పూడ్చలేదు. ఈ గొయ్యి వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని గిరిజనలు, ప్రయాణికులు కోరుతున్నారు.

– కొత్తూరు

అక్రమ చొరబాట్లను అరికడదాం

- నరసన్నపేటలో సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీకి ఘన స్వాగతం


గ్లూకోజ్ బాక్స్ అందజేస్తున్న పారామిలటరీ అసోసియేషన్ ప్రతినిధులు

నరసన్నపేట: సముద్రం ద్వారా ఇతర దేశస్తులు అక్రమ చొరబాట్లకు పాల్పడుతున్నారని, దేశంలో అల్లర్లు సృష్టించేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని సీఐఎస్ఎఫ్ కమాండెంట్ ఎం.ఆశిఫ్ అన్నారు. తీర ప్రాంత ప్రజలను చైతన్యం చేయాలనే ఉద్దేశంతోనే కోల్‌కతా నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైకిల్ ర్యాలీ ఆదివారం నరసన్నపేటకు చేరుకుంది. జిల్లా పారామిలటరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పైడితల్లి కూడలి వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ర్యాలీలో పాల్గొన్న సైనికులు, బందోబస్తుగా ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది సేద తీరారు. స్వాగతం పలికిన వారిలో స్థానిక ఎస్‌ఐ దుర్గాప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధిలు యాళ్ల అప్పలనాయుడు, గంగిట్ల శ్రీనివాసరావు, ఎస్.రవికుమార్, చల్ల సింహాచలం, సీపాన లక్ష్మణరావు, కె.రామారావు, ఎస్.తిలక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దు

సారవకోట: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ఒత్తిడి పెంచవద్దని మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ మాకేన సురేష్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని నవతేజ పాఠశాలలో మానసిక వ్యక్తిత్వంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం చాలా మంది తల్లిదండ్రులు చదువు, చదువు అంటూ వారి పిల్లలపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారని, దీని వలన చాలా మంది బాల్యాన్ని కోల్పోతున్నారన్నారు. పిల్లలకు ఎటువంటి అంశాలపై ఆసక్తి ఉందనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. వారికి ఆసక్తి ఉన్న రంగాలలో ప్రావీణ్యతకు కృషి చేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో కుటుంబ వ్యవస్థ లేకపోవడంతో అనేక అనార్థాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. దీనివలన పిల్లలు మానసిక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, దేవునిపై భక్తిభావం పెంచాలన్నారు. పాఠశాల డైరెక్టర్ పారిశెల్లి తేజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


బగాది సౌజన్య

ఆమదాలవలస: పట్టణానికి చెందిన బగాది సౌజన్యకు జిల్లాలోని ఎచ్చెర్లలో గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ అధికారులు పీహెచ్‌డీని (డాక్టరేట్) ప్రదానం చేశారు. ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు మార్గదర్శకత్వంలో 'ఉద్యోగుల నిమగ్నత'పై పరిశోధన చేశారు. గృహోపకరణాల పరిశ్రమలో ఉత్పత్తి తీరు, ఉద్యోగ సంతృప్తిని పెంచడంపై వెలుగును ఇస్తుందని సౌజన్య ఆదివారం తెలిపారు. సౌజన్యను పలువురు అభినందించారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం


నరసన్నపేట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బెంచీలపై నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

నరసన్నపేట: మండలంలో టెన్త్ పరీక్షలు ఐదు కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఎంఈఓ యు.శాంతారావు ఆదివారం తెలిపారు. 1,212 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెంట్ క్లారెట్, నారాయణ స్కూల్‌లో రెండు చొప్పున కేంద్రాలు మంజూరైనట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు సమయానికి హాజరుకావాలని సూచించారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఆదివారం బెంచీలపై నంబర్లు వేయించారు.

ఆమదాలవలస రూరల్: పదో తరగతి పరీక్షలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. ఆమదాలవలస రూరల్, మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 1,073 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

సరుబుజ్జిలి: టెన్త్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఈఓ డి.బాలరాజు ఆదివారం తెలిపారు. మండలంలోని కొత్తకోట, సరుబుజ్జిలి హైస్కూళ్లకు పరీక్ష కేంద్రాలు మంజూరైనట్లు వెల్లడించారు. కొత్తకోటలో 187 మంది, సరుబుజ్జిలి కేంద్రంలో 172 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

కూటమి పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం


శిమ్మ సాంబశివరావు

ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యా రంగం పూర్తిగా నిర్వీర్యమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఓ సమావేశంలో మాట్లాడారు. ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు ఈ ప్రభుత్వం ఫీజులు చెల్లించలేని దుస్థితిలో ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థను అభివృద్ధి చేస్తానని ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు.. తన తొమ్మిది నెలల పాలనలో వాటిని నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఎంత మంది పిల్లలు చదివివే అంత మందికి తల్లికి వందనం పథకం ఇస్తామని నమ్మించారన్నారు. మరో నెల రోజుల్లో ఈ విద్యా సంవత్సరం ముగుస్తుందని, తల్లికి వందనం ఎందుకు ఇవ్వలేదో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. మాటపై నిలబడే వ్యక్తి మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ ఇచ్చిన మాట ప్రకారం అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని వక్తలు కొనియాడారు. అమరజీవి సేవలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


పాతపట్నం: వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు


ఆమదాలవలస: మున్సిపల్ కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేస్తున్న మున్సిపల్ అధికారులు


ఆమదాలవలస: లక్ష్మీనగర్‌లో అమరజీవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య మహా సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్మకూరు రామకృష్ణ, తదితరులు


కొత్తూరు: మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి చిత్రటానికి నివాళులర్పిస్తున్న ఏపీ రాంబాబు, సిబ్బంది


మెళియాపుట్టి: కొసమాలలో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయుడు రామరాజు, తదితరులు


నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధర్మాన పద్మప్రియ, నాయకులు